WILLIAM SOMERSET MAUGHAM'S

# 'OF HUMAN BONDAGE'

# జీవన పాశం

అనువాదం

**కాకాని చక్రపాణి**

ఎమెస్కో

# జీవన పాశం

**ఆ** రోజు మబ్బుగా, బద్ధకంగా తెల్లవారింది. మేఘాలు దట్టంగా కమ్ముకుని వున్నాయి. గాలిలోని ఎముకల్ని కొరికే శీతలత్వం మంచు కురవటాన్ని సూచిస్తోంది. పిల్లవాడు నిద్రపోతున్న గదిలోకి ఓ పనిమనిషి వచ్చింది; తెరలు తొలగించింది. పోర్టికోతో స్టక్కో రీతిలో కట్టిన ఎదురింటివైపు యాంత్రికంగా చూసి, పిల్లవాడి పక్కదగ్గర కొచ్చిందామె.

"లే, ఫిలిప్, లే" అందామె.

దుప్పట్లను తొలగించి అతన్ని ఆమె తన చేతుల్లోకి తీసుకుంది. అతన్ని ఎత్తుకుని క్రిందకు వచ్చింది. అతనింకా పూర్తిగా మేల్కొనిలేదు.

"మీ అమ్మ పిలుస్తోంది" అందామె.

క్రింది అంతస్తులో ఓ గది తలుపు తెరిచి, పక్కమీద పడుకునివున్న ఓ స్త్రీ దగ్గరకు పిల్లవాడిని తీసుకుని వచ్చిందామె. ఆ స్త్రీ అతని తల్లి. ఆమె చేతులు చాచింది. పిల్లవాడు ఆమె పక్కన ఒరిగిపోయాడు. తన్నెందుకు నిద్రలేపారని అతనడగలేదు. ఆ స్త్రీ ఆ పిల్లవాడి కళ్ల మీద ముద్దు పెట్టుకుంది. తన తెల్ల ఫ్లానెల్ నైట్‌గౌనులో నుండి తన చిన్న సన్నటి చేతులతో అతని వెచ్చని ఒంటిని తడిమింది. అతన్ని తనకు దగ్గరగా అదుముకుంది.

"నిద్రమత్తుగా వుందా బాబూ?" అడిగిందామె.

ఎంతో దూరం నుండి వినవస్తున్నట్లుగా ఆమె గొంతు చాల బలహీనంగా వుంది. పిల్లవాడు జవాబివ్వలేదు కాని, హాయిగా నవ్వాడు. ఆపెద్ద, వెచ్చటి పక్కమీద, ఆ మెత్తటి చేతులు తన్ని చుట్టి వుండటం అతనికెంతో హాయి అన్పించింది. ఇంకా చిన్నవాడై, ఒదిగిపోతూ అమ్మని కౌగలించుకున్నాడు. నిద్రమత్తులోనే ఆమెని ముద్దుపెట్టుకున్నాడు. ఓక్షణంలో అతని

కనురెప్పలు వాలిపోయాయి. గాఢమైన నిద్రలోకి జారిపోయాడు. డాక్టరు ముందుకొచ్చి ఆమె మంచం పక్కన నిలబడ్డాడు.

"అయ్యో, అప్పుడే వాడిని తీసుకెళ్లకండి" అందామె హీనస్వరంతో.

డాక్టరు జవాబేమీ ఇవ్వకుండా గంభీరంగా ఆమె వంక చూశాడు. పిల్లవాడిని ఎక్కువసేపు తన దగ్గర వుండనివ్వరని ఆమెకు తెలుసు. ఆమె పిల్లవాడిని ముద్దుపెట్టుకుంది. అతని శరీరాన్ని స్పృశిస్తూ అతని కాలిదాకా సారించిందామె తన చేతిని. అతని కుడికాల్ని తడిమి, కాలి ఐదువేళ్లను స్పృశించింది. ఆ తర్వాత మెల్లగా తన చేతిని ఎడమకాలి వైపు సాచింది. ఒక్కసారిగా దుఃఖంతో వెక్కుపెట్టసాగింది ఆమె.

"ఏమయింది?" అన్నాడు డాక్టరు. "నువ్వు అలసిపోయావు."

ఆమె మాట్లాడలేకపోయింది. తల అడ్డంగా వూపింది. కన్నీళ్లు బుగ్గలంట కారాయి. డాక్టరు పడకమీదకు వంగాడు.

"నన్ను తీసుకోనీ వాడిని."

ఆయన్ని ఎదిరించగలిగే బలం లేదామెకు. పిల్లవాడిని వదిలేసిందామె. డాక్టరు పిల్లవాడిని మళ్లీ దాది కందించాడు.

"మళ్లీ పిల్లవాడిని వాడి పక్కలో పడుకోబెట్టు."

"అట్లాగేనండీ."

ఇంకా నిద్రపోతూనే వున్న పిల్లవాడిని ఆమె తీసుకెళ్లింది. అతని తల్లి గుండె బద్దలైనట్టు వెక్కిళ్లుపెట్టి ఏడవసాగింది.

"చిన్న వెధవ ఏమవుతాడు?"

నెల జీతం మీద పనిచేసే దాది ఆమెని ఓదార్చప్రయత్నించింది. అయితే, నిస్త్రాణతో ఆమె ఏడుపు ఆగిపోయింది. గదిలో మరోబల్ల దగ్గరకు వెళ్లాడు డాక్టరు. బల్లమీద తుండుగుడ్డలో మృతశిశువు శరీరం వుంది. ఆయన తువ్వాలునెత్తి చూశాడు. పక్క మీద వున్న ఆమెకు అడ్డంగా తెర వుండటంవల్ల ఆయన కన్పించలేదు. కానీ, ఆయన చేసేది ఆమె ఊహించగల్గింది.

"బాబా, పాపా?" అని మెల్లగా అడిగింది దాదిని.

"ఇంకో బాబు."

ఆమె జవాబివ్వలేదు. మరుక్షణంలో పిల్లవాడి దాది తిరిగి వచ్చింది. పక్క దగ్గర నిలబడింది.

"బాబు ఫిలిప్‌కు మెలకువ రాలేదు" అందామె.

ఎవరూ మాట్లాడలేదు. డాక్టరు రోగి నాడిని పరీక్షించాడు మరోసారి.

“నేనిప్పుడు చేయగల్గిందేం లేదనుకుంటాను. పొద్దున ఫలహారమైం తర్వాత మళ్లీ వస్తాను” అన్నాడాయన.

“మీకు దారి చూపిస్తాను. రండి” అంది పిల్లవాడి దాది.

నిశ్శబ్దంగా మెట్లు దిగారు వాళ్లు. హాల్లో డాక్టరు ఆగాడు.

“కారే సతీమణి బావగారికి కబురంపారు కదూ?”

“ఆఁ పంపాం.”

“ఆయనెప్పుడొస్తాడో మీకేమన్నా తెల్సా?”

“తెలీదండీ. టెలిగ్రామేమన్నా వస్తుందేమో.”

“ఆ చిన్నపిల్లవాడి సంగతేంటి? పిల్లవాణ్ణి దూరంగా వుంచితే మంచిదనుకుంటాను.”

“మిస్ హెన్రీటా వాట్కెన్ అతణ్ణి తీసుకెళ్తానన్నది.”

“ఎవరామె?”

“అతడి గాడ్ మదర్. కారే సతీమణి దీన్ని తట్టుకోగలదంటారా?”

డాక్టరు తల తిప్పాడు.

## 2

**ఓ** వారం రోజుల తర్వాత. ఆన్ స్లో గార్డెన్స్‌లో వున్న హెన్రీటా వాట్కెన్ ఇంట్లోని డ్రాయింగ్ రూంలో నేలమీద కూర్చునివున్నాడు ఫిలిప్. ఒకే సంతానమవటంవల్ల తనొక్కడే ఆడుకునే అలవాటుంది అతనికి. గది గట్టి ఫర్నిచర్‌తో నిండిపోయివుంది. ప్రతి సోఫాలో మూడు పెద్ద కుషనులున్నాయి. చేతుల కుర్చీలో కూడ కుషనుంది. వాటన్నిటినీ ఉపయోగిస్తూ, కదిలించటానికి తేలికైన గిల్ట్‌రాట్ కుర్చీలతో అతనో విశాలమైన గుహనేర్పరచుకున్నాడు; తెరల వెనుక తిరుగాడుతున్న రెడ్ ఇండియన్ల నుండి తప్పించుకుని దాగివుండటానికి అనువుగా వుంది ఆ గుహ. నేలకి తల ఆన్చి, గడ్డిమైదానాలగుండా పరిగెడుతున్న దున్నపోతుల మంద చేసే శబ్దాన్ని వినసాగాడతను. అప్పుడు తలుపు తెరిచిన శబ్దంవిని, తన ఉనికిని ఎవరూ కనుక్కోగూడదన్నట్లుగా అతను శ్వాసను బిగబట్టాడు. కానీ, ఓ బలమైన చెయ్యి ఓ కుర్చీని లాగటంతో కుషన్లు కిందపడిపోయాయి.

“అల్లరి పిల్లవాడా, హెన్రీటా గారికి కోపం వస్తుంది నీపనికి.”

“ఎవరూ, ఎమ్మా!” అడిగాడతను.